కడవెడు కష్టాలకు చెక్

- జోరుగా జలజీవన్ మిషన్
- రూ. 29.25 కోట్లతో తాగునీటి పనులు
- ఇప్పటికే 30 శాతం పనులు పూర్తి
- ఇంటింటికీ కొళాయి ఏర్పాటుతో తీరుతున్న నీటి కష్టాలు

పల్లెలను పట్టి పీడిస్తున్న నీటి సమస్యకు ఇక తెర పడనుంది. ఊరూరా ఓవర్ హెడ్ ట్యాంకులు.. ఇంటింటికీ కొళాయి అమర్చి తాగునీటి ఎద్దడికి చెక్ పెట్టనుంది ప్రభుత్వం. ఇందు కోసం కేంద్ర, రాష్ట్రాల సంయుక్త భాగస్వామ్యంతో జలజీవన్ పథకం అమలు జరుగుతోంది. ఫలితంగా ఇక కడవెడు కష్టాలు తొలగిపోనున్నాయి.



విజయపురం మండలం కేవీపురం హెచ్‌డబ్ల్యూలో పైపులైను పనులు, నగరి మండలం బుగ్గఅగ్రహారంలో వేస్తున్న పైపులైను

పుత్తూరు రూరల్: గ్రామీణ ప్రాంతంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ధృడ సంకల్పంతో జలజీవన్ మిషన్ పథకాన్ని అమలు చేస్తున్నాయి. నగరి నియోజకవర్గంలోని పుత్తూరు, వడమాలపేట, నగరి, నిండ్ర, విజయపురం మండలాల్లో రూ.29.25 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంకులు, పైపులైన్లు తదితర 295 రకాల పనులు వివిధ దశల్లో జోరుగా జరుగుతున్నాయి. ఇప్పటికే రూ.8 కోట్లు విలువ చేసే 30 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను ఈ ఏడాది ఆగస్టు నెలకి పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం ఉందన్న కారణంగా గత టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసింది. అయితే గ్రామీణ ప్రజల నీటి కష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకం అమలుకు రాష్ట్రవాటా నిధులు ఎప్పటి కప్పుడు విడుదల చేస్తూ పనులను వేగవంతం చేస్తోంది. ఫలితంగా పలు గ్రామాల్లోని ప్రతి ఇంటికీ కొళాయి అమర్చి నీరు అందించనున్నది. అవసరమైన చోట్ల ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించి, ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. ఇప్పటికే ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకుల వద్ద నుంచి ప్రతి ఇంటికీ పైపు లైన్లు వేసి, ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు ఇస్తున్నారు. దీంతో పాటు ప్రతి ట్యాంకును ప్రతి 15 రోజులకోసారి క్లోరినేషన్ చేయించి, తాగునీరు కలుషితం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇలా ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేసి నీటి కష్టాలను తొలగించడంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలం	పనుల సంఖ్య	పూర్తయినవి	జరుగుతున్నవి	టెండర్లు పిలిచినవి	నిధులు (రూ.కోట్లలో)
నగరి	118	25	35	58	12.69
నిండ్ర	53	18	35	4.37	
విజయపురం	64	12	19	33	8.46
పుత్తూరు	27	18	8	1	0.60
వడమాలపేట	33	15	2	16	3.13
మొత్తం	295	88	64	143	29.25

తొలగనున్న నీటి కష్టాలు



ప్రభుత్వం 2024 మార్చి నాటికి పనులు పూర్తి కావా లని ఆదేశించింది. అయితే నగరి నియోజకవర్గంలో ఇప్పటికే 30 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది ఆగస్టు నాటికే మిగిలిన పనులును పూర్తి చేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం. ఈ ఏడాదితో నీటి కష్టాలు పూర్తిగా తొలగిపోనున్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ జలజీవన్ మిషన్ పథకంపై ఎంతో ఆసక్తిని కనబరుస్తున్నారు.
–ఎం.ఆర్.సతీష్‌కుమార్, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్ సబ్‌డివిజన్, నగరి

వైభవంగా మహాకుంభాభిషేక వేడుకలు


కుంభాభిషేకం చేస్తున్న వేదపండితులు

నగరి: పట్టణంలోని సత్రం దక్షిణపు వీధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ జీర్ణోద్ధరణ అష్టబంధన మహాకుంబాభిషేక మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఆలయంలో కాలయాగ పూజ, మహాపూర్ణాహుతి, ప్రసాద వినియోగం కార్యక్రమా లు నిర్వహించారు. వేదపండితులు జీవీ సుబ్రమణ్యశర్మ, వి.లక్ష్మీనారాయణ శర్మ, ఓరుగంటి సుంద్రమూర్తి, ఆలయ అర్చకులు వర్దిపర్తి కృష్ణారావు శర్మ కలశ పూజలు నిర్వహించి, కుంభ కలశాలతో ఆలయ ప్రదక్షిణం చేసి, మేషలగ్నంలో అమ్మవారి ఆలయ గోపురశిఖరానికి అభిషేకం చేశారు. ఆలయంలోని వాసవీదేవికి, ఉత్సవ విగ్రహాలకు మహాఅభిషేకం చేసి విశేషాలంకరణ చేసి, కర్పూర హారుతులిచ్చారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారిని ఊరేగించారు. ఆలయ అధ్యక్షుడు అన్నం రవీంద్రబాబుగుప్త ఏర్పాట్లను పర్యవేక్షించారు.

6న మండల మీట్

గంగాధరనెల్లూరు: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 6 తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తామని ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొనాలన్నారు. అధికారులు శాఖల వారీగా తమ ప్రగతి నివేదికలు తయారు చేసుకుని హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

దాతల సేవలు అభినందనీయం

కార్వేటినగరం: గర్భిణులు, బాలింతలకు పౌష్టికహారాన్ని అందజేసిన దాతల సేవలు అభినందనీయమని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మసునంద అన్నారు. శుక్రవారం మండలంలోని గంగమాంబాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి పట్టాభిరెడ్డి కుమారుడు దిలీప్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అంగన్‌వాడీ పిల్లలు, గర్భిణులు, బాలింతలకు వెయ్యి కోడిగుడ్లను వితరణ చేశారు. దాత పట్టాభిరెడ్డి, సర్పంచ్ లోకనాథనాయుడు, పర్యవేక్షకులు ఇందిర, షామిని, అంగన్‌వాడీ కార్యకర్తలు రాధిక, సుగుణ, పద్మావతి, విమల పాల్గొన్నారు.

మండల మీట్ వాయిదా

వెదురుకుప్పం: మండల సాధారణ సర్వ సభ్య సమావేశం వాయిదా వేశారు. శుక్రవారం ఉదయం వెదురుకుప్పం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశమందిరంలో ఎంపీపీ నాగరాణి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. అయితే సమావేశం ప్రారంభించిన వెంటనే ఎంపీడీఓ సుధాకర్‌రావు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా సమావేశం వాయిదా వేసినట్లు తెలిపారు.

వేదవిద్యలో రజితకు డాక్టరేట్


పీహెచ్‌డీ అందుకుంటున్న రజిత

నగరి: పట్టణంలోని ఎస్ఆర్‌నగర్‌కు చెందిన రజితకు తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. వేదాలు, ఉపనిషత్తులు, కర్మలు, పౌరోహిత్యంపై పరిశోధన చేసి, పత్రాలు సమర్పించడంతో ఆమెకు డాక్టర్‌రేట్ అందజేశారు. గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. ప్రతిభ చూపి డాక్టరేట్ అందుకున్న విద్యార్థిని పలువురు ప్రశంసించారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయపురం: అద్దె వ్యవసాయ పనిముట్ల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ రజని తెలిపారు. సూరికాపురం, విజయపురం, కాళికాపురం, పన్నూరు, కేవీపురం, బూచివానత్తం, ఇల్లత్తూరు పరిధిలోని కస్టమ్‌హైరింగ్ గ్రూపు రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రూపు ద్వారా కొనుగోలు చేసిన పరికరాలను రైతులకు అద్దెకు ఇచ్చి ఆర్థికంగా ఎదగాలన్నారు.

ఉపాధ్యాయులకు అవగాహన

నగరి: ఎమ్మెల్సీ ఎన్నికలపై ఉపాధ్యాయులకు స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అడల్ట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, డీసీఓ చిత్తూరు బ్రహ్మానందరెడ్డి హాజరై ఉపాధ్యాయులందరికీ ప్రాధాన్యతా క్రమంలో ఓటు ఎలా వేయాలి, ఏమిచేస్తే ఓటు ఇన్‌వ్యాలిడ్ అవుతుందో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, ఏపీఓ ప్రసాద్, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించండి

కార్వేటినగరం: సచివాలయాల్లో మెరుగైన సేవలు అందించి, ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ మోహన్‌మురళి అన్నారు. శుక్రవారం మండలంలోని అన్నూరు, ఆలత్తూరు సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సమస్యలపై వచ్చే ఆర్జీదారులను చిరునవ్వుతో పలకరిస్తూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు మనోజ్, మహేష్ పాల్గొన్నారు.

ద్రౌపదీ దేవికి విశేష పూజలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వేకువజామునే అమ్మవారిని ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. తరువాత పాలాభిషేకం చేశారు. అనంతరం విశేషాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు దర్శనం కల్పించారు.

పుష్ప రథంపై సుబ్రమణ్యేశ్వరస్వామి


పుష్ప రథంపై ఊరేగుతున్న స్వామివారు

పుత్తూరురూరల్: సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి అమ్మవార్లు పుష్పరథంపై విహరించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లు పుష్పరథంపై పురవీధుల్లో ఊరేగారు. ఇంటింటా కర్పూరహారతులిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త సుందరం పర్యవేక్షించారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం


చెక్కు అందజేస్తున్న సర్పంచ్ దొరస్వామి

కార్వేటినగరం: విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరమని, క్రమశిక్షణతో విద్యనభ్యసించిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని డిస్ట్రిక్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి కే.హేమారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పాదిరికుప్పం ఉన్నత పాఠశాలలో పదో తరగతి వీడ్కోలు సభ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్ష, పెద్దలపై గౌరవం అవసరమన్నారు. విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు దూరంగా ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని సూచించారు. విద్యకు పేదరికం అడ్డుకాదని, తల్లిదండ్రుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకుని చదువులబాట పట్టాలని సూచించారు. అనంతరం డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చెంగల్‌రాజు మాట్లాడుతూ విద్యకు మించిన ఆస్తి లేదని, ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి తమ కుటుంబాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం సరస్వతీ పూజ చేశారు. అలాగే విద్యార్థులకు సర్పంచ్ దొరస్వామి పరీక్ష సామగ్రి కొనుగోలుకు రూ.15 వేల చెక్కును హెచ్‌ఎంకు అందజేశారు. విద్యార్థులు చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పొన్నుస్వామి, వైఎస్సార్‌సీపీ నేత రమేష్‌బాబు, ఏఈ నాగభూషణం, హెచ్‌ఎం నాదమునిరెడ్డి, ఉపాధ్యాయులు గురుమూర్తి, జ్యోతి, వేణుగోపాల్, సుప్రజ పాల్గొన్నారు.

మంచి పాలనకు మద్దతు పలకండి


కరపత్రాలు చూపుతున్న మంత్రి సోదరుడు రామ్‌కుమార్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు

నగరి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి, మంచి పాలనకు మద్దతు పలకాలని మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. శుక్రవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, పట్టభద్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. యువత, నిరుద్యోగులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పేర్నాటి గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలన్నారు. కరపత్రాలను, బ్యాలెట్ నమూనాను అందరికీ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, ఢిల్లీ, ఆర్బీకే మండల అధ్యక్షుడు బుజ్జిరెడ్డి పాల్గొన్నారు.

పేర్నాటిని భారీ మెజారిటీతో గెలిపించండి


పుత్తూరులో ప్రచారం చేస్తున్న కుమారస్వామిరెడ్డి

పుత్తూరు రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.కుమారస్వామిరెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం పట్టణంలో పలు కాలనీల్లో పట్టభద్రులను కలిసి ప్రచారం చేశారు. కుమార స్వామిరెడ్డి మాట్లాడుతూ సేవా దృక్పథం కలిగిన శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించుకుంటే అందరికీ అందుబాటులో ఉంటారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర అణగారిన సామాజిక వర్గాలందరికీ న్యాయం జరిగేలా అభ్యర్థుల ఎంపిక జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, కౌన్సిలర్లు ఏకాంబరం, గుణశేఖర్, భువనేశ్వరి, చిట్టిబాబు, బాలాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు మనోహర్‌రెడ్డి, జనార్దన్‌యాదవ్, ఈశ్వరయ్యాయాదవ్, ఉమామహేశ్వర్, చిన్నా, చక్రీ, రత్నం, మనోజ్, కడియాల నాయుడు, చిరంజీవి పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు


మురుగు కాలువలో పూడిక తీస్తున్న సిబ్బంది

పాలసముద్రం: వెంగళరాజుకుప్పం పంచాయతీలోని గ్రామాల్లో శుక్రవారం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. ఈ పనులను సర్పంచ్ లిల్లీ, వైస్ ఎంపీపీ పుష్ప, పంచాయతీ కార్యదర్శి సుధ పర్యవేక్షించారు. డ్రైనేజీ కాలువల్లో పూడిక తీశారు. వీధులకిరువైపులా, ఇళ్ల పరిసరాల్లో ఉన్న మురుగు తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లారు. దోమల నివారణకు మందు పిచ్చికారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి సుధ మాట్లాడుతూ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. డ్రైనేజీలో నీరు నిల్వ చేరకుండా చూసుకోవాలని, మురుగు నిల్వ చేరితే దోమలు వృద్ధి చెంది, వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. దోమలు కుట్టకుండా రాత్రి సమయంలో దోమలు తెరలు ఉపయోగించుకుంటే మంచిదన్నారు. దగ్గు, జ్వరం, జలుబు వచ్చిన వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా బంగారు అడిగళార్ పుట్టినరోజు వేడుకలు


రొట్టె, భోజనం అందజేస్తున్న ఓంశక్తి భక్తులు

నగరి: మేల్‌మరువ్వూరు ఆదిపరాశక్తి పీఠం ఆధ్యాత్మిక గురువు బంగారు అడిగళార్ 83వ పుట్టినరోజు వేడుకలు, ఆదిపరాశక్తి ఆధ్యాత్మిక ఉద్యమ ప్రధాన కార్యదర్శి శక్తి ఏఏ అగత్తియన్ జన్మదినాన్ని స్థానిక ఓంశక్తి భక్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక ప్రజాసేవ ఉద్యమం రాష్ట్ర కార్యదర్శి వీటి భాస్కరన్ ఆధ్వర్యంలో నగరి శిరీడ్స్ దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు అన్నదానం చేశారు. ఏరియా ఆస్పత్రిలోని రోగులకు రొట్టెలు, బిస్కెట్లు, భోజనం ప్యాకెట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంట గోపాల్, ఉద్యమ సేవకులు గోవిందస్వామి, ఎం.కమలాకర్, జి.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు


మాట్లాడుతున్న నోడల్‌అధికారి

కార్వేటినగరం: ఎమ్మెల్సీ ఎన్నికలను పగడ్బందీగా నిర్వహించాలని వయోజన విద్యానోడల్ అధికారి కందేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సంచాలకులు జయప్రకాష్‌రెడ్డి, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఈఓ మణి పాల్గొన్నారు.

సంతాన వేణుగోపాలస్వామి వార్షికోత్సవం రేపు

గంగాధరనెల్లూరు: మండలంలోని మహదేవమంగళం సమీపంలో ఉన్న సంతాన వేణుగోపాలస్వామి ఆలయ 47 వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం గోపూజ, అభిషేకాలు, అలంకరణ, కల్యాణోత్సవం, సాయంత్రం గిరి ప్రదక్షిణ, రాత్రి ఊంజలోసేవ జరుగుతాయన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

డ్రైడే పాటించండి


ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

నగరి: డ్రైడే పాటించి.. వ్యాధుల నుంచి బయటపడాలంటూ మండలంలోని మిట్టపాళెంలో బుగ్గ అగ్రహారం పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పుత్తూరు సబ్‌యూనిట్ అధికారి జి.మోహన్‌బాబు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఇంట్లో నీటి పాత్రలను కడిగి, ఎండపెట్టి డ్రైడే పాటించాలన్నారు. నీటి డ్రమ్ములను, తొట్టెలపై మూతలు ఉంచాలన్నారు. మురుగునీటి కాలువల్లో వారానికి ఒక సారి ఆయిల్‌బాల్స్ వేయాలన్నారు. ఇంట్లో వేపాకు పొగ వేయాలని, ఇలా చేయడంతో కీటక జనిత వ్యాధులు మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోధకాలు, మెదడువాపు తదితర వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ రవీంద్ర, పర్యవేక్షకులు బి.బాబు, ఆరోగ్య కార్యకర్తలు కళ, రవిచంద్రన్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి


మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న గురవయ్య

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ గురవయ్య తెలిపారు. శుక్రవారం సింహరాజుపురం ప్రాథమికోన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ గురవయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఎండీఎంకు నాణ్యమైన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సరఫరా చేస్తుందన్నారు. విద్యార్థులు రుచిగా, శుచిగా పాఠశాలలోనే భోజనం తినేలా రోజుకో మెనూను అమలు చేసి, కోడిగుడ్డు, చిక్కీలను కూడా ఇస్తుందని చెప్పారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ప్రభుత్వం గౌరవవేతనం ఇస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాల్సిన బాధ్యత మీపై ఉందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు చేసిన సాంబారును రుచి చేశారు.

రైతులకు అందుబాటులో ఉండాలి


ఏఓ వనితతో మాట్లాడుతున్న నాయకులు

వెదురుకుప్పం: రైతులకు అన్నివిధాలు అందుబాటులో ఉంటూ సేవలందించాలని వ్యవసాయాధికారి సి.వనితను వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. శుక్రవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న వ్యవసాయాధికారిని నాయకులు జగిని మునికృష్ణారెడ్డి, హరినాథ్, శివాజీ కలసి. సమస్యలను విన్నవించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. మండలంలో మారుమూల గ్రామాల్లోని రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు, సేవలపై అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు తదితర అంశాలకు సంబంధించి రాయితీ ద్వారా అందజేస్తున్నా రైతులకు తెలియకపోవడం గమనార్హమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అందించే పథకాలు, సేవలకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందని ఆమెను అడిగారు. పంటల సాగులో మెళకువలు లేకుండా రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా స్పందించి రైతులకు అందుబాటులో ఉండి సాగులో వారి అనుమానాలను నివృత్తి చేయాలన్నారు.

కాలువ పూడ్చివేతకు నిరసనగా ఆందోళన


గ్రామస్తులతో మాట్లాడుతున్న శివప్రకాష్ రాజు

పాలసముద్రం: రాచపాళెం గ్రామం కుమ్మర ఇండ్లు పక్కన ఉన్న చెరువుకు నీటినందించే కాలువను పూడ్చివేశారంటూ శుక్రవారం గ్రామస్తులు ఆందోళన చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ వెంగళరాజుకుప్పం పాత చెరువు నుంచి మొరవనీరు వచ్చే పురాతన కాలువను అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కాలువను పూడ్చివేసి, ఇంటికి రోడ్డు వేసుకున్నాడని ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖ కమిటీ సభ్యుడు ఎస్ శివప్రకాష్ రాజు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ సిమెంట్ పైపులు వేసి, చెరువులోకి నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా పూడ్చివేసిన కాలువను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. సిమెంట్ పైపులపై మట్టి తోలుకుని రోడ్డు వేస్తామని చెప్పడంతో గ్రామస్తులు నిరసన విరమించుకున్నారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు గోవిందరాజులు ఉన్నారు.

రసాయనాల వినియోగం తగ్గించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ ఢిల్లీప్రసాద్

పాలసముద్రం: వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని ఏఓ ఢిల్లీప్రసాద్ తెలిపారు. శుక్రవారం సీఎం కండ్రిగలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రసాయనిక ఎరువుల మోతాదును తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. అధికంగా రసాయనిక ఎరువుల వాడకంతో భూసారం తగ్గిపోతోందన్నారు. మితిమీరి రసాయనిక ఎరువులను వాడితే సారవంతమైన భూములు కూడా 15 ఏళ్లకు చౌడు భూములుగా మిగిలిపోతాయన్నారు. పచ్చిరొట్ట సాగు చేసుకోవాలన్నారు. పశువుల పేడతో భూములు సారవంతమవుతాయన్నారు. రైతులు భూసార పరీక్షల ఆధారంగా పంట సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వనజ పాల్గొన్నారు.

డ్వాక్రా సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించాలి


మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం: మండలంలోని డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రభుత్వం ఇస్తున్న పలు రకాల రుణాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. శుక్రవారం శ్రీకావేరిరాజుపురం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో సీసీ లోకనాథం, సంఘమిత్ర శోభ అధ్యక్షతన ఎస్‌కేఆర్ పురం వీఓ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజీ రుణాల బకాయి కంతులను చెల్లించాలన్నారు. తీసుకున్న రుణాలను వృథాగా ఖర్చుపెట్టకుండా అధిక లాభాలు వచ్చే కుటీర పరిశ్రమలకు పెట్టుబడులు పెట్టి, అధిక ఆదాయం ఆర్జించాలని చెప్పారు. కార్యక్రమంలో సంఘమిత్ర మురగయ్య, డ్వాక్రా సంఘాల సభ్యులు, లీడర్లు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గ సభ్యులు

పుత్తూరు రూరల్: పట్టణ సమాచార హక్కుల వేదిక నూతన అధ్యక్షుడిగా ఏ.బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం అంబేడ్కర్ భవన్‌లో సమాచార హక్కుల వేదిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన నూతన కార్యకవర్గ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ప్రధాన కార్యదర్శిగా కె.మురగారెడ్డి, సహాయ కార్యదర్శిగా కె.దొరస్వామి, ఉపాధ్యక్షుడిగా జె.సుభద్ర, కోశాధికారిగా కె.హేమలత, ఎక్సిక్యూటివ్ సభ్యులుగా మరో 10 మందిని ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి మురగారెడ్డి మాట్లాడుతూ పుత్తూరు పరిసర ప్రాంతాల సమస్యలపై సంఘం పోరాటం చేస్తుందన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు


విద్యార్థినులకు పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

నగరి: మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శుక్రవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాలకు చెందిన వైద్యులు సుమారు 100 మందికి రక్తపరీక్షలు చేసి, వెంటనే ఫలితాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అనేది భారతీయ నానుడి అని, కావున ప్రతి విద్యార్థీ ఆరోగ్య సూత్రాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. రక్తంలో హీమోగ్లోబిన్ శాతం పురుషులలో 14–18 జీఎం/డీఎల్ ఉండాలని మహిళలలో 12–16 జీఎం/డీఎల్ ఉండాలని అంతకంటే తక్కువైతే క్రమంగా అనీమియాకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం కన్వీనర్ ఇందిరా ప్రియదర్శిని, అధ్యాపకులు అరుణ కుమారి, వేణుగోపాల్, భాస్కర రాజు, షర్మిల, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.